# మార్బుల్ ముస్తాబు ముచ్చట

- భమిడిపాటి సోమయాజి

కామేశం తండ్రి దిగాలుగా చెట్టు నీడలో కూర్చున్నాడు. కామేశం తండ్రికి పేరుంది కానీ కామేశం పెళ్లయిన తరువాత, ఒక అనామకుడ్ని అనుకుంటూ ఎవరైనా 'మీ పేరేమిటండి?' 'పేరులో ఏముందిలెండి పెన్నిధి' అనీ, తల్లిదండ్రులు పెట్టిన పేరు తప్ప వేరే పేరు సంపాదించలే కపోయాననీ విచార వదనంతో చెప్పేవాడు.

కామేశం తల్లి ఆ చెట్టు దగ్గరికే వచ్చి "అస్తమానూ ఈ చెట్టు కింద కూర్చుంటున్నారు. ఇల్లుగలవాళ్ళు చూస్తే ఏమైనా అంటారేమోనని భయంగా వుంది. ఆ బుద్ధుడికి చెట్టు కిందే జ్ఞానోదయమైందిట. మీరు చాలా రోజులబట్టీ ఈ చెట్టు క్రిందే కూర్చుంటున్నారు. కానీ జ్ఞానోదయం మాట అలా వుంచండి. కనీసం నేను చెప్పేది కూడా మీకు అర్థం కావ డంలేదు. ఎంతోమంది మొగవాళ్ళు ఇల్లరికం వెడుతున్నారు. అలాగే మన కామేశం కూడా ఇల్లరికం వెళ్లాడు. ఇదేదో పెద్ద తప్పు జరిగిపోయినట్లు మీరు అలా మధనపడడం బాగాలేదు. మీ ఆరోగ్యం కూడా చెడిపోతుంది"

"అదికాదే. నువ్వు కొంచెం మొండిదానివి. అందుకని నువ్వు బాధపడవు. పెళ్లయిన తరువాత గృహ ప్రవేశమప్పుడు పురోహితుడు 'కుడికాలు లోపల పెట్టమ్మా' అని కోడల్ని అనవలసింది పోయి మన కామేశాన్ని ఇల్లరికం కదా అని హేళ నగా 'బాబూ! కుడికాలు లోపల పెట్టు' అనడం, దాంతో కొందరు ముసిముసిగా నవ్వడం నేనిప్ప టికీ మరువలేక బాధ పడుతున్నాను" అన్నాడు కామేశం తండ్రి.

"సర్లెండి. రేపు పదహారు రోజుల పండుగ అయిపోతే అన్నీ అవే మరచిపోతాం. అయినా వీడు పెద్దగా చదువుకోకపోయినా ఇల్లరికం కనుకనే వీడ్ని వాళ్ల పిల్లకి చేసుకున్నారు. వాళ్లది పెద్ద ఇల్లు. కారు కూడా ఉంది. పిల్లాడు సుఖపడతాడు. అయినా కామేశం మామగారు కూడా ఇల్లరికమే నట."

"అదిగో అదే వద్దు. ఏదో ఆడపిల్ల పెళ్లయిన తరువాత మంచి సంబంధం దొరికింది, పిల్ల సుఖ పడుతుందన్నట్లు చెబుతున్నావు. ఇలాంటి మాటలే నన్ను బాధిస్తాయి" అన్నాడు కామేశం తండ్రి.

"సర్లెండి. మీరలాగే అఘోరించండి. నేను వెళ్లి వంట తగలేస్తాను"

"వెళ్లు. తగలెయ్యకుండా వంట అవదని నాకు తెలుసు"

***

కామేశం పెళ్లయి ఆరునెలలయిపోయింది. కామేశం పుట్టింట్లో చాలా గారంగా పెరిగాడు. ఈ ఇల్లరికం కామేశం ప్రాణానికొచ్చింది. చిన్నప్పుడు ఎన్నిసార్లు చెప్పినా శ్రద్ధగా చదవలేదు. ఆ అశ్రద్ధ ఫలితం ఇల్లరికం రూపంలో ఒక రాక్షసిగా సంప్రా ప్తించింది అని ఆలోచిస్తున్న కామేశాన్ని మామ గారు-

"ఏమోయ్ కామేశం! అసలే శీతాకాలం పొద్దు. అలా కూర్చుంటే పన్లవవు. చీకటి పడిపోతోంది. మీ అత్తగారు అసలే ముక్కోపి, చెడామడా తిడు తుంది. ఆ దూడలకి గడ్డేసిరా. మళ్లీ పాలు పితికే వేళయిపోతుంది" అంటూ మందలించారు.

'ఏమిటో ఖర్మ! ఈ గేదెలు వట్టిపోతే బాగుం డును. పాలు పితికే పనైనా తప్పుతుంది. అయినా ఇంత డబ్బున్నవాళ్ళు పాలు కొనుక్కోవచ్చు కదా.ఈ గేదెలు పెంచడమెందుకు?' అనుకుం టున్న సమయంలో అత్తగారు రానే వచ్చింది. రంకెలు మొదలుపెట్టింది.

"ఆర్నెల్లయిపోయింది నువ్వు కాపురానికి వచ్చి. నీకసలు చురుకేలేదు. అదే మీ మామగారు మూడునెలల్లో మొత్తం పని నేర్చేసుకుని మా నాన్న గారి చేత శభాష్ అనిపించుకున్నారు. పెళ్లిచూ పుల్లో నీకన్ని పన్లూ వచ్చుని మీవాళ్ళు చెబితే ఈ సంబంధం ఖాయం చేసుకున్నాం" అంది అత్త గారు.

"ఒక్కొక్కటే నేర్చుకుంటున్నాను అండీ" అని అక్కడనుంచి వెళ్లాడు కామేశం.

ఇదే మంచి సమయం అని కామేశం మామ గారు "నాసాటి ఏ మగాడికీ రాదే. నేనసలు అన్నిం ట్లోనూ చురుగ్గా వుంటాను" అన్నారు.

"సర్లెండి గొప్ప! మీకసలు మా ఇంట్లో మొత్తం పన్లు నేర్చుకోవడానికి రెండేళ్లు పట్టింది. అలా చెబితే అల్లుడు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటా డని అన్నానంతే. అల్లుడు వచ్చాడు కదాని మీరు పన్లు చేయడం పూర్తిగా మానేయకండి. అల్లుడికి ఎప్పుడైనా అనారోగ్యం వస్తే మీరు చెయ్యవలసి వస్తుంది. అలవాటు తప్పితే పనులు చేయడం కష్ట మని నేను ముందే చెప్తున్నాను."

'హార్నీ! నేను అనవసరంగా దీన్ని కదిపాను' అనుకున్నాడు కామేశం మామగారు.

***

ఒకసారి వంట చేసేటప్పుడు చారులో ఉప్పు ఎక్కువ వేసాడు.

ఆ చారు వేసుకుని కామేశం అత్తగారు చాలా చిరాకుపడింది.

"వంట జాగ్రత్తగా చేయకపోతే ఎలా తింటామ నుకున్నావు. అసలు చారు పెట్టడం అనేది కష్టం కాదు. అటువంటి నువ్వు ఇదే సరిగ్గా చేయలేదు. మీ మామగారు చెప్పింది విని శ్రద్ధగా చేయి."

"అదికాదత్తయ్యా! మరచిపోయి రెండోసారి ఉప్పు వేసి ఉంటాను. నన్ను క్షమించు అత్తయ్యా" అన్నాడు కామేశం.

అసలే చారు బాగాలేదని చిరాకుగా ఉందేమో ఆవిడ "అత్తయ్యా! నేనేమైనా నీ మేనత్తనా? అత్త గారూ అనలేవూ. వెధవ పెంపకాలు. మగపిల్లల్ని సరిగ్గా పెంచకపోతే ఇలాగే ఏడుస్తారు. ఇల్లరికం పంపే మగపిల్లల్ని జాగ్రత్తగా పెంచాలన్న విషయం కూడా తెలీదు మీ పుట్టింటివాళ్లకి. నీకు తెలియకపోతే మీ మామగార్ని చూసి నేర్చుకో. ఆయన మా అమ్మని నెత్తిమీద పెట్టుకునేవారు. మా అమ్మ కూడా 'నీ భర్త ఇల్లరికం మణిపూసే' అనేది."

***

కామేశం మామగారికి అల్లుడు సుఖ పడిపోతు న్నాడనే అనుమానం వచ్చింది.

"ఏమిటయ్యా! అస్తమానం చాలా కష్టపడి పోతున్నట్లు మొహం పెడతావు. నేను కాపురానికి వచ్చిన కొత్తల్లో ఈ గేస్‌స్టవ్‌లు, కుక్కర్లు, మిక్సీలు,

గ్రైండర్లు ఉండేవికావు. చచ్చినట్లు పొయ్యి వెలిగించి వంట చేసేవాడ్ని, పప్పు రుబ్బేవాడ్ని, కారాలు దంచేవాడ్ని. నువ్వేమిటో ఇన్ని సౌకర్యాలున్నా 'అబ్బా... ఉస్సు' అంటుంటావు అస్తమానం''

''ఏం చేస్తామండీ... మాది వంటలు చేసే వంశం కాదు. మరి అందుకని కష్టంగా వుంది'' అన్నాడు కామేశం.

''అంటే మాది వంటలు చేసే వంశమా?'' అన్నాడు మామగారు.

అలా కొంతసేపు తోడికోడళ్లలాగా దెబ్బలాడుకున్నారు.

'ఉండు... నీ రోగం కుదురుస్తానని' తన భార్యతో చాడీ చెప్పాడు. 'అసలు నిన్ను అత్తయ్యా, నువ్వు అంటూ ఏకవచన ప్రయోగం చేయడానికి వాడికి ఎన్నివేల గుండెలు?' అని మెల్లగా భార్యనొప్పించి ఆ వెట్‌గ్రైండర్ అమ్మించేసాడు కామేశం మామగారు.

★★★

ఒకసారి కామేశం తండ్రి వచ్చేసరికి కామేశం మినపప్పు రుబ్బుతున్నాడు. తండ్రిని చూసి భోరుమని ఏడ్చేసాడు.

ఆయన కూడా ఏడ్చేసాడు.

ఇది పని కాదని ఒక వెట్‌గ్రైండర్ కొని పంపాడు.

తర్వాత ఆయన ఒకసారి వచ్చినప్పుడు ''ఎప్పుడూ నువ్వే గుర్తొస్తావు నాన్నా. అమ్మ నీమీద కేకలేస్తే మంచివాళ్లకే కష్టాలనేవాడివి. ఆ మాటలు నాకు గుర్తుకొచ్చినప్పుడు ఏడుపొస్తోంది'' అని మళ్లీ భోరుమన్నాడు కామేశం.

★★★

'మళ్లీ కొత్త వెట్‌గ్రైండర్ అమరిపోయిందా? వీడు మళ్లీ సుఖపడిపోతాడేమో? నేను ఈ ఇల్లరికం వల్ల ఎన్ని కష్టాలు పడ్డాను' అని మధ్యమధ్యలో బాధపడిపోయాడు మామగారు. ఎదుటివాళ్ళు సుఖపడితే చూడలేనివారు వచ్చే జన్మలో కూడా ఇల్లరికానికి పోతారు. ఇది గ్రహించలేని మామగారు వున్న సిమెంట్ గచ్చు బద్దలు కొట్టించి మార్బుల్ వేయించేటట్లు భార్యను ఒప్పించాడు.

ఇంకేముంది! మార్బుల్ గచ్చు రోజూ తడిబట్ట పెట్టి నడుం వంగిపోయేటట్లు తుడిచేవాడు కామేశం. ఎక్కడ మరకలున్నా కామేశం అత్తగారు నానా తిట్లు తిట్టేది 'మార్బుల్ గచ్చుంటే అద్దంలా ఉండాలయ్యా! ఏకారణం చేతనైనా ఇంట్లో అద్దం కనిపించలేదనుకో. నేలపై చూసుకుంటూ ముస్తాబవ్వాలి తెలిసిందా!' అని.

''ఇల్లరికంలో వున్న మజా... అనుభవించితే తెలియునులే'' అని రోజూ ఏడుస్తూ పాడుకునేవాడు కామేశం.

★

